ప్రజాశక్తి
గురువారం 7 సెప్టెంబర్ 2023 5 విజయనగరం

## ఎటిఎం కేంద్రాల్లో ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-గజపతినగరం

ఎటిఎం కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

గజపతినగరం సర్కిల్ పరిధిలోని గొట్లాం, మానాపురం వద్ద ఎటిఎం కేంద్రాల్లో మంగళవారం రాత్రి చోరీలు జరగగా, ఆయా నేర స్థలాలను జిల్లా ఎస్‌పి ఎం.దీపిక బుధవారం ఉదయం పరిశీలించారు. నేర స్థలాలను, నేరం జరిగిన తీరును, సిసి ఫుటేజులను పరిశీలించారు. బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీధర్, ఇంఛార్జి సిఐ ఎస్.తిరుమలరావు, సిసిఎస్ సిఐ ఎం.బుచ్చిరాజు, ఇతర పోలీసు అధికారులకు, క్లూస్ టీం అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటిఎం చోరీలను వెంటనే ఛేధించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు.

**జిల్లాలో వేలాది ఎకరాల భూములు బీడువారుతున్నాయి. వరి నారు ముదిరి పోయింది. ఇక నాటినా ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం లేదంటూ అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మరోవైపు క్రమంగా పడుతున్న వర్షాలకు ఈ నెలాఖరు నాటికైనా వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరి సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే సుమారు 60,852 ఎకరాల్లో ఇంకా నాట్లు పడాల్సి వుంది. గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి మండలాల్లో 6వేల ఎకరాల్లో నేటివరకు ఉబాలు కాలేదు. ఎస్.కోట డివిజన్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ ఉబాల విషయంలో అత్యంత వెనుకబాటు ఉంది. ఈ నేపథ్యంలో గజపతినగరం సబ్-డివిజన్ పరిధిలో ప్రజాశక్తి ప్రత్యేక పరిశీలన చేయగా దుర్భిక్ష పరిస్థితులు కనిపించాయి.**

తుమ్మికాపల్లి గ్రామంలో నాట్లు పడక బీడుగా ఉన్న భూములు

### చెరువులు వెలవెల
### వరి రైతుల కంటతడి
### గజపతినగరం సబ్-డివిజన్‌లో దుర్భిక్ష పరిస్థితి
### 6వేల ఎకరాల్లో తగ్గిన వరి నాట్లు

# బీడువారుతున్న భూములు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ గజపతినగరం

గజపతినగరం మండలంలో అధికారిక లెక్కల ప్రకారం వరి సాధారణ విస్తీర్ణం 8,892 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 6 వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. మండలంలో కొన్ని చెరువులు జూన్‌లో నిండినా ప్రస్తుతం నీరు లేదు. చాలా చెరువులు అసలు నిండలేదు. మిగిలిన 2,962 ఎకరాల్లో ఎక్కువ భాగం మండల కేంద్రానికి దిగువ ప్రాంతంలో ఉంది. వాస్తవ పరిస్థితులు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. జిన్నాం, కెంగువ గ్రామాల పరిధిలోనే సుమారు 500 ఎకరాల మేర నాట్లు పడలేదు. కెంగువ పరిధిలోని చాకలిబంద, మంగలి బంద, మూడు బారిక బందల కింద ఒక్క ఎకరా కూడా సాగవ్వలేదని ఆ గ్రామానికి చెందిన బూడి తవుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గడిచెరువు, రామసాగరం, గంటాడ చెరువు కింద అంతంత మాత్రంగానే నాట్లుపడ్డాయి. జంగల బంద ఆయుకట్టులో అక్కడక్కడ బోర్లు ఉండడంతో పూర్తిస్థాయిలోనే నాట్లు పడ్డాయి. తుమికాపల్లిలోనూ మరో 100 ఎకరాల వరకు ఉబాలు కావాల్సివుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఈ ఊరికి ఆనుకునివున్న కోనేరుతో సహా కంసాలి చెరువు, జక్కోడి బంద తదితర చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. దీంతో, తమ గ్రామ రెవెన్యూ పరిదిలోగల భూములు కొంతమేరకు ఉబాలు పట్టినప్పటికీ, జిన్నాం రెవెన్యూ పరిధిలోగల భూముల్లో ఒక్క ఎకరా కూడా అరకపట్టలేకపోయామని రైతులు వాపోయారు. ఇదే మండలంలోని చినకాద, ముచ్చెర్ల, రామన్నపేట, లింగాలవలసలో చాలా మంది రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షపునీటిని అష్టకష్టాలతో ఒడిసిపట్టి నాట్లు వేస్తే, ప్రస్తుతం పదును లేక ఎండపోతున్నాయని లోగిశ గ్రామానికి చెందిన రెల్లి రాము, పతివాడ రాము ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దత్తిరాజేరు మండలంలో సుమారు వెయ్యి ఎకరాల మేర ఇంకా ఉబాలు కావాల్సివుంది. కనీసం సాగునీటి వనరులు లేకపోవడంతో గడసాం, దత్తి, చింతలవలస, పాచలవలస, జగన్నాధపురం తదితర గ్రామాల్లో నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. బొండపల్లి మండలంలో సుమారు 1056 ఎకరాల్లో నాట్లు పడాల్సివుందని అధికారిక సమాచారం. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ తొణికిసలాడే నీటితో కళకలాడే నెలివాడ పెద్ద చెరువు కూడా నిండకపోవడం గమనార్హం. దీంతో, నెలివాడలో 250 ఎకరాల్లో నాట్లు పడాల్సివుండగా కేవలం 80 ఎకరాల్లో మాత్రమే నాట్లుపడ్డాయి. బిల్లలవలసలో 170 ఎకరాలకుగాను 70ఎకరాల్లోనే సాగు కనిపిస్తోంది. మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితి చవిచూడలేదంటూ నెలివాడ గ్రామానికి చెందిన జి.శ్రీనివాసరావు, పైడన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దాదాపు ఎక్కువ గ్రామాల్లో సాగుభూములు ఎంతోకొంత తక్కువగానే ఉన్నాయి. మెంటాడ మండలానికి ఆంధ్ర రిజర్వాయర్ సాగునీటి ప్రదాయినిగా ఉన్నప్పటికీ ఇంకా 517 ఎకరాల్లో నాట్లు పడలేదు. కేవలం గజపతినగరం సబ్ - డివిజన్ మాత్రమే కాదు. దాదాపు అన్ని డివిజన్లలోనూ ఉబాలు వెనుబాటు కనిపిస్తోంది.

జిల్లా వాప్తంగా వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, అపరాలు, చిరుధాన్యాలు తదితర పంటల సాధారణ విస్తీర్ణం 3,13,465 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు కేవలం 2లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. వరి సాధారణ విస్తీర్ణం 2,25,637 ఎకరాలకుగాను ఇప్పటి వరకు కేవలం 1,64,785 మాత్రమే నాట్లుపడ్డాయి. గత ఏడాది ఇదే సమయానికి సుమారు 1,75,000 ఎకరాల్లో నాట్లుపడినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గజపతినగరం మండలంలో 8,892 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, గత ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికే 10వేల ఎకరాలు దాటి ఉబాలు పడ్డాయని ఎఒ ధనలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది దాదాపు అన్ని మండలాల్లోనూ సాగు విస్తీర్ణం తక్కువగా కనిపిస్తోంది.

జిన్నాంలో తగినంత నీరు లేక వెలవెల బోతున్న చెరువు

**అదునుదాటి వర్షాలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గత నెలవరకు జిల్లాలో లోటు వర్షపాతం ఉంది. ప్రస్తుతం అడపా దడపా కురుస్తున్న వర్షాలతో ఏమి చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు. అదును దాటిపోవడంతో నాట్లు వేయాలా వద్దా అనే మీమాంశలో ఉన్నారు. ఒకవేళ వేసినా దిగుబడి రాదని తెలిసి ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో మంగళవారం 16.7 మి.మీ., వర్షం కురిసింది. అత్యధికంగా బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో వర్షం కురవగా, అత్యల్పంగా గరివిడి, బొండపల్లి, జామి, విజయనగరం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో కురిసింది. బుధవారం కూడా పలు మండలాల్లో వర్షాలు కురిశాయి.

**నాలుగెకరాలకు ఒక్క ఎకరాలోనే ఉబాలు**

నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇప్పటి వరకు అతికష్టంమీద ఒక ఎకరాలో మాత్రమే వరినాట్లు వేశాను. మిగిలిన భూమిలో నాట్లు వేసేందుకు వర్షం కోసం ఎదురు చూడాల్సివస్తోంది. మరోవైపు నారుపోసి రెండు నెలలు కావచ్చింది. ఇక నాటినా తగిన దిగుబడి రాదని అంటున్నారు. ఈ ఏడాది ఏం చేయాలో ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

-మరడాన సన్నాసప్పడు, తుమ్మికాపల్లి. గజపతినగరం మండలం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు

### సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

## 10న కలెక్టరేట్ వద్ద వేడుకోలుదీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్షా, కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ , పార్ట్ టైం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 10న కలెక్టరేట్ వద్ద 'వేడుకోలు' పేరిట నిరాహారదీక్ష చేయనున్నట్లు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా చైర్మన్ బి.కాంతారావు తెలిపారు. బుధవారం ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేసి, వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్షా ఉద్యోగుల వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదని తెలిపారు. ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో జీవనం దుర్భరంగా మారిందన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ , పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ మినియం టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. కరువు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం, 10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యుటీ కల్పించాలని కోరారు. పిఎఫ్, ఈ ఎస్ ఐ, అమలు చేయాలన్నారు.వేతనం తో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజరు చేయాలని, ప్రతి నెల ఒకటి తేదీకి వేతనాలు చెల్లించాలని, వేతనాలు కోసం సంవత్సరానికి సరిపడే బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలని కోరుతూ చేపట్టనున్న ఈ నిరాహారదీక్షలో ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో కృష్ణంనాయుడు, ఎర్రినాయుడు, అప్పారావు, పైడిరాజు, సిఆర్ఎంటి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గురువులు, జిల్లా నాయకులు లక్ష్మణరావు, కె. పార్వతి పాల్గొన్నారు.

## 8న పలు గ్రామాలకు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 8న విజయనగరం మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్తు లైన్ల మెయింటెనెన్సు పనులు జరుగుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటలు వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. దుప్పాడ, జొన్నవలస, చిల్లపేట, సారిక, గుండాలపేట, కోరుకొండ, పినవేమలి, రాకోడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

## బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి

### ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-బొబ్బిలి

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. స్థానిక వెలమ కమ్యూనిటీ భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే బదిలీ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. వక్రమార్గంలో ఉపాధ్యాయులను బదిలీ చేశారని, ఆ బదిలీలను వెంటనే రద్దు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. ఆయనతో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జోగినాయుడు ఉన్నారు.

## ఆదరణను ఓర్వేలేకే దాడి

### టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే వైసిపి నాయకులు దాడులు చేయిస్తున్నారని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు అన్నారు. బుధవారం అశోక్‌బంగ్లాలో వారు విలేకర్లతో మాట్లాడారు. భీమవరంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్‌పై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. లోకేష్ బాబు పాదయాత్రలో అన్ని వర్గాల వారిని కలిసి వారి సమస్యలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యుత్తు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ఇవేవీ పట్టించుకోని వైసిపి ప్రభుత్వం చంద్రబాబు, నారాలోకేష్ పర్యటనలను అడ్డుకునేందుకు చూస్తోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

## సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

### డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం మలిచర్ల, సుంకర పేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వెల్ నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గ్రామస్వరాజ్యం తెచ్చిన ఘనత వైసిపిదేనని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందిస్తూ, పూర్తిగా ఆదుకునే పరిస్థితిల్లో ఉన్నారన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించి మెరుగైన పంట విధానాన్ని రాష్ట్రంలో తీసుకొస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతతంలో రాష్ట్రం ఎంతో అభివద్ధి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు దిగజారుడు రాజకీయాలతో లేనిపోని అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి కొసరి నిర్మల, సుంకరి పేట సర్పంచ్ సుంకరి రాజేశ్వరి, మలిచర్ల సర్పంచ్ తుమ్మగంటి రమాకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు కోలగట్ల శంకుస్థాపన**

నగరంలోని 44వ డివిజన్ పరిధిలో రూ. 48.10 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బుధవారం ఆ డివిజన్లోని సుందరయ్య కాలనీ, చెంచుల కాలనీలలో సిసి రహదారులు, కల్వర్టులను ప్రారంభించారు. అనంతరం ఎస్‌కె డిగ్రీ కాలేజి సమీపంలో సిసి రహదారికి శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజావసరాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక దష్టి సారించి నగరంలో అనేక అభివద్ధి పనులు చేపడుతున్నారన్నారు. వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ మాట్లాడుతూ తమ డివిజన్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కార్పొరేటర్లు సైలాడ ఈశ్వరమ్మ, బొద్దూరు గోవిందమ్మ, జోనల్ ఇంచార్జ్ తమ్ము, వైసిపి నాయకులు మహేష్, సూరిబాబు, బొద్దూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పిటిసి

## జాతీయ తైక్వాండో పోటీల్లో 11 పతకాలు

### సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 2 నుంచి 4 తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీ లో జరిగిన 14వ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొన్న జిల్లాకు చెందిన 11 మంది క్రీడాకారులు 5 బంగారు, 3 సిల్వర్, 3 కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లాకు చెందిన 11 మంది క్రీడాకారులు పతకాలు సాధించడం విజయనగరం చరిత్రలో ఇదే మొదటి సారి. ఈనేపథ్యంలో జిల్లాకు చేరుకున్న క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు.చదువుతో పాటు క్రీడలు కూడ విద్యార్థులకు అవసరమని అన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్నగురాన అయ్యలు, వేణుగోపాలరావు

## ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ టాప్ స్కోరర్‌గా తపస్వి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 6 వరకు విశాఖ విజయనగరం వేదికలపై సీనియర్ విభాగంలో జరిగిన ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన పిన్నింటి తపస్వి టాప్ స్కోరర్‌గా నిలవడంపై జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ ఎల్ ఎన్ రాజు అభినందనలు తెలిపారు. తన తొలి మ్యాచ్‌లో శ్రీకాకుళంపై 29 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ తో జరిగిన రెండో మ్యాచ్‌లో 70 పరుగులు, గుంటూరుతో జరిగిన మూడో మ్యాచ్‌లో 100 పరుగులు, అనంతపురంతో జరిగిన నాలుగో మ్యాచ్‌లో 60 పరుగులు, రెస్ట్ ఆఫ్ సౌత్ తో జరిగిన ఐదో మ్యాచ్‌లో 100 పరుగులతో నాటౌట్ గా నిలిచి రాష్ట్ర స్థాయిలో 358 పరుగులతో తొలి స్థానంలో నిలిచాడు. దీంతో తపస్విని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ సీతారామరాజు, సెలెక్టర్లు బంగారురాజు, వర్మ, సర్వరాజు జిల్లా క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

## 9న జిల్లా అథ్లెటిక్స్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరు జిల్లా ఎఎస్‌ఆర్ స్టేడియంలో జరుగు జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టు ఎంపిక ఈనెల 9న విజ్జీ స్టేడియంలో జరుగుతుందని అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు లీలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు 14, 16, 18,20,23, వయసు కలిగిన బాల బాలికలు పాల్గొనవచ్చునని తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ లేదా ఎస్ఎస్‌సి సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు.

## పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాహుల్‌గాంధీచేపట్టిన భారత జోడో యాత్రకు ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈనెల 7న కాంగ్రెస్ కార్యాలయం నుంచి కోటజంక్షన్ వరకు పాదయాత్ర చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ కి సంఘీభావం తెలుపుతూ ఈ పాదయాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, డిసిసి కార్యదర్శి చంద్రశేఖర్ , గుజ్జు రాజు తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బిలిలో మద్యం మాఫియా

- తూతూ మంత్రంగా దాడులు
- రూ.లక్షల్లో చేతులు మార్పిడి?

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపి అధికారంలోకి వస్తే మద్యపానాన్ని నియంత్రిస్తామని ప్రకటించిన సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ అమలు కాలేదు. గ్రామాల్లో పూర్తిగా బెల్ట్ షాపులపై నిషేధం ఉన్నప్పటికీ బొబ్బిలిలో ఎక్కడ అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారిస్తోంది. బొబ్బిలిలో ఒక మద్యం మాఫియా తయారై గ్రామాల్లో బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం మాఫియా నుంచి, బెల్ట్ షాపుల నిర్వాహకులు నుంచి సంబంధించిన అధికారులకు రూ. లక్షల్లో ముడుపులు అందుతున్నట్లు సమాచారం.

**ప్రభుత్వ మద్యం షాపులు నుంచి మద్యం సరఫరా**

బొబ్బిలి పట్టణంలో ఐదు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతుంది. బజారు సంచులు, స్కూల్, కళాశాల బ్యాగులలో మద్యాన్ని తరలిస్తున్నారు. మద్యం మాఫియాలో ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేస్తున్న ఉద్యోగులు కూడా ఉండడంతో బెల్ట్ షాపులకు మద్యం సరఫరా సులభంగా వెళ్తుంది. ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేస్తున్న ఉద్యోగులు ఒక పట్టణ పోలీసు అధికారుల సహాయ సహకారాలతో మద్యం మాఫియాగా ఏర్పడి బెల్ట్ షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బెల్ట్ షాపులకు మద్యం సరఫరా**

బొబ్బిలిలో కొంతమంది మద్యం మాఫియాగా ఏర్పడి బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులకు ప్రభుత్వ మద్యం దుకాణాలు నుంచి నేరుగా మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. పట్టణంలోని ఆరు, చింతాడలో ఒక ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. ఈఅ దుకాణాలు నుంచి మద్యం మాఫియా ప్రతిరోజు మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. బొబ్బిలి మండలంలో ఉన్న 30 పంచాయతీలలో 44 గ్రామాలు ఉన్నాయి. 38 గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మద్యం షాపు వద్ద బాటిళ్లు కొనుగోలు చేసి బ్యాగ్‌లో వేస్తున్న సిబ్బంది

**రూ. లక్షల్లో చేతులు మారుతున్న వైనం**

బెల్ట్ షాపులు నిర్వహణకు సహకరిస్తున్న అధికారులకు రూ. లక్షల్లో ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొబ్బిలి పట్టణానికి ఏడు కిలోమీటర్లు దూరంలో ఒక పంచాయతీలో నెలకు బెల్ట్ షాపు పాట రూ.30వేలుకు అయింది. ఒక్క మద్యం సీసాకు ఎమ్మార్పీ ధరకు అదనంగా రూ.30 వేసుకుని అమ్మాలని నిబంధన ఉంది. ఆగ్రామంలో రోజుకు 150 మద్యం సీసాలు వరకు అమ్ముడుపోతాయి. నెలకు 4500 మద్యం సీసాలు అమ్ముడుపోగా ఆగ్రామ బెల్ట్ షాపు నిర్వాహకునికి నెలకు రూ.1.35లక్షలు ఆదాయం వస్తుంది. బెల్ట్ షాపుపై దాడి చేసి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు సంబంధిత అధికారులకు ఆగ్రామం నుంచి నెలకు రూ.50వేలు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక బెల్ట్ షాపు నుంచి నెలకు రూ.50వేలు వస్తున్నాయంటే మండలంలో ఉన్న 38 బెల్ట్ షాపులు నుంచి ఎంత మొత్తంలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చును. ఈ పరిస్థితి బొబ్బిలి మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతుంది.

**మద్యం మాఫియా దగ్గర కొనుగోలు చేయకుంటే కేసులే**

బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మద్యం మాఫియా నుంచి మద్యాన్ని కొనుగోలు చేయకుండా నేరుగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసి బెల్ట్ షాపు నిర్వహిస్తే సంబంధించిన అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని చర్చ జరుగుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలు నుంచి మద్యాన్ని నేరుగా మాఫియా సభ్యులు బెల్ట్ షాపులకు తరలిస్తారు. మద్యం మాఫియా సభ్యులే అమ్మకాలను బట్టి నెలవారీ మామ్ముళ్లు వసూలు చేసి సంబంధించిన అధికారులకు అందిస్తారని చర్చ జరుగుతుంది. బెల్ట్ షాపులు నుంచి అక్రమ వసూళ్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కూడా చర్చ జరుగుతుంది. మద్యం మాఫియా దగ్గర మద్యం కొనుగోలు చేయని బెల్ట్ నిర్వాహకుల పేర్లను సంబంధిత అధికారులకు అందజేస్తే వారు నేరుగా బెల్ట్ షాపులపై దాడి చేసి కేసులు నమోదు చేస్తారని తెలుస్తోంది.

**బెల్ట్ షాపులు నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

పట్టణ, గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులు నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరపడంతో యువత కూడా మద్యానికి బానిసవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి మద్యం నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం: గాజులురేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో గోపిక వేశధారణలో పిల్లలు

ప్రజాశక్తి- బొబ్బిలి
పట్టణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న పిల్లలకు శ్రీకృష్ణుడు, గోపికలు వేషధారణ వేపించి ఉట్టులను కొట్టించారు. ఈ వేడుకలను చూసేందుకు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు హాజరయ్యారు.

**కొత్తవలస:** మండలంలోని అప్పన్నపాలెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. టిడిపి విశాఖ పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు, ఉత్సవ కమిటీ చైర్మన్ తిక్కాన చిన్నదేముడు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు వేదపండితులు పిలకా విశ్వనాధం ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజలు, మండప ఆవాహనాలు, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోయి డాన్సులు, సాము గరిడీలు, శ్రీకృష్ణ వేషాలు, తప్పెడుగుళ్ళు, చిరుతలు, భజనలు, బాణాసంచాతో కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), టిడిపి రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, కొత్తవలస మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకట రత్నాజీ, టిడిపి విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కొరుపోలు అప్పారావు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో విగ్రహాన్ని ఊరేగిస్తున్న సభ్యులు

**నెల్లిమర్ల:** నగర పంచాయతి పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లో దేవాంగుల వీధిలో ప్రబోధ సేవా సమితి- ఇందు జ్ఞాన వేదిక విజయనగరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. అనంతరం కోలాటాలతో పుర వీధుల్లో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, ప్రబోధ సేవా సమితి సభ్యులు బత్తుల గోవింద, తులసి, శ్రీనివాసరావు, శ్రీదేవి, ధనలక్ష్మి, వినోద్ కుమార్, కృష్ణమ్మ పాల్గొన్నారు.

**వేపాడ:** మండలంలో బక్కు నాయుడుపేట, వేపాడ, జాకేరు, కృష్ణరాయుడుపేట గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తవలస: శ్రీకృష్ణుని విగ్రహం వద్ద నమస్కారం చేస్తున్న కోళ్ల లలిత

**లక్కవరపుకోట:** మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుని మాదిరిగా అలరించిన వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎస్‌వి రమణ, ఉపాధ్యాయ బృందం ఎస్ హారిక, సీనియర్ కరాటే శిక్షకులు రాజు మాస్టర్, టి శ్రీనివాసరావు, డి రామసత్యం, ఎం సత్యనారాయణ, కనకమహాలక్ష్మి, పి రామలక్ష్మి, ఏ మంజులత, కె వెంకటలక్ష్మి, వి.పైడిరాజు, బి.భవాని, ఆషా, సుగేని, పి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**మెరకముడిదాం:** మండల కేంద్రంలోని సన్‌రైజ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ బివిఆర్ మూర్తి ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు వేసిన రాధా, కృష్ణుని వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుని జనన ప్రదర్శన, బృందావన నృత్య ప్రదర్శనలు విద్యార్థుల తల్లి తండ్రులను, పాఠశాల సిబ్బందిని మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్ మెంట్ తరపున నాగరాజు, అరుణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌కోట: గోపికల వేశధారణలో ఉన్న శ్రీచైతన్య విద్యార్థులు

**విజయనగరం టౌన్ :** శ్రీకృష్ణుడు మహా జ్ఞాన సంపన్నుడని డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రబోధ సేవాసమితి- ఇందూ జ్ఞానవేదిక విజయనగరం శాఖ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి ఆడిటోరియం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శాఖ అధ్యక్షులు వానపల్లి శంకరరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల మాట్లాడుతూ.. భగవద్గీత నిజ భావాన్ని తెలియజేసే ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అందరూ చదవాలని సూచించారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు ఏ కార్యక్రమం చేపట్టినా తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. సుమారు పదేళ్లుగా జిల్లాలో ఈ ఉత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నామని శంకరరావు తెలిపారు. ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామివారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం, బీసీ సంఘం నాయకులు ముద్దాడ మధు, మన్యాల కృష్ణ, బొద్దాన అప్పారావు, గదుల సత్యలత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్, కోట:** నగరంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రింగురోడ్డు వద్ద గల నారాయణ పైడితల్లి భవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి దేవీ , పాఠశాల ఆర్ఐ రాజేష్ , పాఠశాల కో ఆర్డినేటర్ దమయంతి విచ్చేసి విద్యార్థులకు శ్రీ కృష్ణ జన్మ వృత్తాంతాన్ని వివరించారు. మంచిని గెలిపించేందుకు చెడుతో శ్రీకృష్ణుడు పోరాటం చేశాడని అన్నారు. విద్యార్థులు రాధాకృష్ణుని వేషధారణలో వచ్చి, సంగీత నృత్య కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

విజయనగరం: రింగురోడ్డు నారాయణ స్కూల్లో శ్రీకృష్ణ, గోపికల వేశధారణలో విద్యార్థులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పలుచోట్ల ఘనంగా జరిగాయి. విద్యార్థులు రాధాకృష్ణ వేషధారణలతో అలరించారు. శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ , నారాయణ స్కూల్ సంయుక్త నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంస్కృతి సాంప్రదాయాలు విలువలను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్ రామానాయుడు మాట్లాడుతూ మన పండగల విశిష్టతను గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియపరచడం వలన వాటిని పరిరక్షించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: వివిధ వేశధారణలో సన్‌రైజ్ పాఠశాల పిల్లలు

## కొనసాగుతున్న పవన్ పుట్టినరోజు వేడుకలు

**లక్కవరపుకోట:** జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే జనసేన ఈ నెల 2న మండల కేంద్రంలో కేక్ కటింగ్‌తో పాటు పాదయాత్ర, 45 మంది అభిమానుల నుండి 45 యూనిట్ల రక్తదానం, బైక్ ర్యాలీ, దుప్పట్లు, అన్నం పొట్లాలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేసినప్పటికీ అంతటితో ఆగకుండా తాజాగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్ స్టేషన్ రోడ్డు మొదలుకొని మరికొన్ని రోడ్లలో 200 మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఒబ్బిన సత్యనారాయణ, పులిబంటి సంతోష్, కోలా మధు, రుద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభను జయప్రదం చేయండి

**బొబ్బిలి:** రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అంటూ సిపిఐ నిర్వహిస్తున్న బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 8న తిరుపతిలో జరగనున్న సిపిఐ బహిరంగ సభకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక జండా మహల్ సెంటర్ వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రానికి కేంద్రానికి అనేక నష్టాలు జరుగుతున్నాయన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, నాయకులు కె వెంకట సత్యనారాయణ, వై బాబ్జి, రామారావు, సూరి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సురేష్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

**బొబ్బిలి:** గురువుల కన్నా గూగుల్ మిన్న అని, గురువుల దగ్గర కన్నా, గూగుల్‌లో ఎక్కువ మెటీరియల్ దొరుకుతుందని చెప్పిన మంత్రి ఆదిమూలపు సురేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ డే సందర్భంగా ఒంగోలు సభలో అలా మాట్లాడటం రాష్ట్రంలోని లక్షలాది మంది టీచర్స్‌ను అవమానించడమేనని చెప్పారు. గురువుల సన్మాన కార్యక్రమంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం టీచర్లపై ప్రభుత్వానికి ఎంత గౌరవం ఉందో తెలుస్తోందన్నారు. స్కూల్స్, కాలేజీలు నడుపుతున్న మంత్రి సురేష్, టీచర్స్‌ను అగౌరపరచడం సిగ్గుచేటన్నారు. 5వ తేదీ వచ్చినప్పటికీ టీచర్స్‌కు జీతాలు చెల్లించలేని ప్రభుత్వం సిగ్గుపడాల్సింది పోయి, టీచర్స్ డే రోజు వారిని అవమానించడం విచారకరమన్నారు. ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన మంత్రి సురేష్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

**బొబ్బిలి:** ఎస్‌సి రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గీకరించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ బొద్దాన అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడుకు ఈ మేరకు ఎంఆర్‌పిఎస్ బృందం వినతి పత్రాన్ని సమర్పించింది. ఎమ్మెల్యే శంబంగి స్పందిస్తూ సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఈ వినతి పత్రాన్ని అందజేసి ఆ దిశగా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌సిలలో సమానత్వ సాధనకు రిజర్వేషన్లను వర్గీకరణ చేయడం మినహా మరొక అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాలలో బిసి లలో ఎబిసిడి ఉన్న మాదిరిగానే ఎస్‌సిలలో కూడా ఎబిసిడి రిజర్వేషన్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కాగాన సునీల్ కుమార్ మాదిగ, బొబ్బిలి నియోజకవర్గ ఇంఛార్జి కింతలి రాము మాదిగ, పిల్లి శంకర్రావు మాదిగ, కింతలి చంటి మాదిగ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరస్పాండెంట్ మహేశ్వరరావు

## నేత్రదానం మరొకరికి చూపినిస్తోంది..

**కొత్తవలస:** సమాజంలో నేత్రదానం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి ఇంకొకరికి చూపునివ్వాలని వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ కోట్ని మహేశ్వరావు అన్నారు. నేత్ర దాన వారోత్సవాలు సందర్భంగా, మోషిని ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో, స్థానిక వాగ్దేవి కళాశాల ఆవరణలో బుధవారం నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో మోషిని ఐ బ్యాంకు చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా విన్నకోట రాజేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు 150 కార్నియా సేకరించినట్లు, అనేక మందికి చూపుకు సహకరించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సమాజ సేవకు, అంకితమై కార్నియా సేకరణకు కృషి చేయాలన్నారు. డాక్టర్ తెన్నేటి సుబ్బారావు, మోషి ఐ బ్యాంక్ సిబ్బంది అభిజిత్, కాత్యాయిని, కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ బాబు, పూసర్ల సాయి, చెరుకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మైలాన్ వద్ద సిఐటియు నిరసన

ప్రజాశక్తి -పూసపాటిరేగ
మండలంలోని మైలాన్ పరిశ్రమ వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ మైలాన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి. సూర్యనారాయణ మాట్లాడుతూ మైలాన్ పరిశ్రమలో ఎంబి-11లో వెల్‌సెట్రన్ అనే కెమికల్ వల్ల కార్మికులకు కిడ్నీ, గుండె జబ్బులు వస్తున్నాయన్నారు. దీంతో గతంలో సుమారు 20 మందిని ఎంబి -11 నుండి ఇతర సేఫ్టీ బ్లాకులకు మార్చారన్నారు. వారితో పాటు ఎం.సూరిబాబు అనే కార్మికుడును ఎహెచ యు డిపార్టుమెంట్‌కు మార్చారన్నారు. అక్కడ నుండి మళ్ళీ ఇప్పుడు ఎంబి-11కి మార్చేస్తున్నారన్నారు. ఇది సరైంది కాదని నిరసన చేస్తున్నామన్నారు. సూరిబాబును ప్రస్తుతం పనిచేస్తున్న డిపార్ట్ మెంట్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న యాజమాన్యం, కాంట్రాక్టరులు స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారని తెలిపారు. సూరిబాబుకు ఈరోజు నుండే డ్యూటీ ఇవ్వడానికి, సూరిబాబుతో పోరాటంలో ఉన్న వాళ్ళని కూడా డ్యూటీకి తీసుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. గురువారం కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి గతంలో బ్లాకు మార్చిన 20 మంది కార్మికులకు ఏదైతే నిర్ణయం చేశామో సూరిబాబు కూడా అదే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరిన నేపథ్యంలో సిఐటియు దానికి అంగీకరించి పోరాటాన్ని విరమించిందని చెప్పారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.నారం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం సూరిబాబు, వైస్ ప్రెసిడెంట్ పతివాడ శ్రీను, జాయింట్ సెక్రెటరీ అప్పలనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

# బెంచీలు వితరణ

ప్రజాశక్తి- బాడంగి
మండలంలోని గజరాయునివలస గ్రామంలో కోట ఈశ్వరరావు 45 గార్డెన్ బెంచీస్‌ను(సిమెంట్ బెంచీలు) ప్రతి వీధిలోనూ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చి వితరణ చేశారు. ఎంపిటిసి పాలవలస గౌరి, సర్పంచ్ ముడడ్ల సత్యం, గ్రామ పెద్దలతో వీటిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి, సర్పంచ్ మాట్లాడుతూ గతంలో కూడా గజరాయినివలసలో దేవి విగ్రహం దసరా నవరాత్రులో భాగంగా స్టేజి, పెండల్స్ టెంట్స్, మొత్తం స్టేజి సెట్‌కి సుమారు రూ.5లక్షలను కోట ఈశ్వరరావు సొంత నిధులను సేవభావంతో ఖర్చు చేశారన్నారు. ప్రతి సంక్రాతికి గ్రామంలో ఆటలు పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహణ నిమిత్తం సుమారు రూ.లక్ష సొంత నిధులను సేవా దృక్పథంతో ఖర్చు చేస్తూ పుట్టిన ఊరికి తనవంతుగా సహకారం అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లగుడు సత్యం నారాయణ, మాజీ ఎంపిటిసి తెర్లి కామునాయుడు, ఉప సర్పంచ్, టిడిపి నాయకులు గునుపూరు కృష్ణ, రెడ్డి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెంచీలను ప్రారంబిస్తున్న నాయకులు

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - కొత్తవలస
వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల ఉత్తరాపల్లి క్లస్టర్‌లో ఉత్తరాపల్లి, గాంధీనగర్, చిన్నిపాలెం, రాయపూరాజుపేట, అప్పన్నపాలెం, నిమ్మళపాలెం అంగన్వాడీ వర్కర్స్ సంయుక్తంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికహారం ఆవశ్యకతపై వైద్య బృందం అవగాహన కల్పించింది. ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్, ఫేట్స్, సమపాలలో తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ అసిస్టెంట్ సత్యారావు తెలిపారు. పోషకాహార లోపం వల్ల పిల్లలలో క్వాషియార్కర్, మారాస్మస్ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, రాగి మాల్ట్, తీసుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పదార్థాలు కిట్‌లో మంచి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పిల్లలకి బాలామృతంలో కూడా మంచి పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. పోషణ విలువలు కలిగిన పాలు, గుడ్లు, పండ్లు, బెల్లం, రాగిమాల్ట్‌తో కూడిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ వైవిఎస్ లక్ష్మి, వరలక్ష్మి, శోభారాణి, అప్పలకొండ, సత్య కౌసల్య, అప్పడమ్మ, కనకరత్నం, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్ సత్యారావు

## కో-ఆప్షన్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి- బొబ్బిలి
మున్సిపల్ కో-అప్షన్ పదవికి రాజీనామా చేయనున్నట్లు రియాజ్ ఖాన్ చెప్పారు. టిటిడి కల్యాణ మండపం రోడ్డులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు తాను న్యాయం చేసుకోలేకపోతున్నానని, ప్రజలకు న్యాయం చేయలేనని చెప్పారు. తనకు, ప్రజలకు న్యాయం చేయని పదవి తనకు వద్దని, కో-అప్షన్ పదవికి రాజీనామా చేసి రాజీనామా లేఖను మున్సిపల్ అధికారులకు అందజేస్తానని చెప్పారు. రాజీనామ చేసినా వైసిపిలోనే కొనసాగుతానని అన్నారు. తనకు ఉపాధి కల్పించే బడ్డీను తొలగించడం చాలా బాధ కలిగించిందన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న తనకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్డీను తొలగించడానికి నిరసనగా బడ్డీని తగలబెట్టాలని చూసి ఫ్లెక్సీను తగలబెట్టానని చెప్పారు.

రాజీనామ పత్రాన్ని చూపిస్తున్న రియాజ్‌ఖాన్

## పోలింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - కొత్తవలస
మండలంలో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా బుధవారం తనిఖీ చేశారు. సుందరయ్యపేట ఎంపిపి స్కూల్ 222 పోలింగ్ కేంద్రాన్ని ఎటువంటి సౌకర్యాలూ లేవన్న కారణంతో నిలుపుదల చేస్తున్నామని దాని స్థానంలో అంగన్‌వాడి భవనాన్ని పోలింగ్ స్టేషన్ 222కి ప్రతిపాదించడానికి పరిశీలన చేశామని తెలిపారు. ఈ ప్రతిపాదనలు ఆర్‌డిఒకు నివేధించనున్నట్లు వెల్లడించారు. కాగా 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో బిఎల్‌ఒలు వచ్చినపుడు చేర్పులు, మార్పులు, ఓట్ల తొలగింపు కార్యక్రమాలను చేపట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఆయన వెంట డిటి టి. రమేష్, మండల రెవెన్యూ పరిశీల కులు సి. హెచ్. రాజేష్, 222 పోలింగ్ స్టేషన్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణ తొలగింపు

ప్రజాశక్తి - వేపాడ
మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో గల విజయరామసాగర్ ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణలను ఆర్‌డిఒ సూర్య కుమారి ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేసి తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, డీటీ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు, ఎస్‌కోట సర్వేయరు తదితరులు పాల్గొన్నారు.

**కాలనీ నిర్మాణం పనులు చేపట్టవద్దని ఆదేశం**

మండలంలోని జగ్గయ్యపేటలో గుడివాడ వాన చెరువు గర్భంలో జగనన్న ఇంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆర్‌డిఒ ఆదేశాలు జారీ చేశారు. చెరువు గర్భంలో నిర్మానాలు చేపట్టడం వల్ల ఆయుకట్టు రైతులకు సాగు నీరు ఉండదని రైతులు రొంగలి వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు పనులు నిలుపుదల చేయమని ఆదేశించిన నేపథ్యంలో ఆమె ఈ ఆదేశాలు ప్రకారం బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకుమారి

## కొంపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేపాడ
మండలంలోని కొంపల్లిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను సేకరించి వారికి పథకాలు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, సర్పంచ్ నౌడు అరుణ, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు ఎం. జగన్నాథం, కన్వీనర్ ఎం. సత్యనారాయణ, స్వప్న, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

## ప్రమాదవశాత్తు నదిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల
ప్రమాదవశాత్తూ బుధవారం స్థానిక చంపావతి నదిలో పడి పూతిక పేటకు చెందిన యడ్ల మంగమ్మ (49) మృతి చెందారు. మంగమ్మ గుర్ల మండలం గోషాడ బంధువుల పరామర్శకు వెళ్ళి తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తూ జ్యూట్ మిల్ గెస్ట్ హౌస్ సమీపంలోని చంపావతి నదిలో పడి మృతి చెందింది. మంగమ్మకు చిన్న తనంలో వివాహం జరిగి భర్త వదిలి వేయడంతో తండ్రి వద్ద ఉంటుంది. స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నదిలో పడి మృతి చెందిన మంగమ్మ

**IN THE HONOURABLE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM IInd ADDITIONAL JUDICIAL 1st CLASS MAGISTRATE AT VIZIANAGARAM**
**I.A. No. 412/2023 O.S. 586 /2019**

Between :-
Koonibilli Pydiraju ......Plaintiff
And
1. Smt. Panchadi Lakshmi W/o Pydiraju, Aged 50 years, Hindu,residing at Kapu Door No.27-6-8/A Kapu Street, Dasannapeta Vizianagarm
2. Sri Panchadi Atchutha Narayana S/o late Pydiraju, aged 24 years, Hindu, residing at Door No.27-6-8/A Kapu Street, Dasannapeta Vizianagarm

.......Defendant

**Summon Notice**

పై నెంబరు దావాలో వాది (Plaintiff) ప్రతివాదులు (defendants) పై కోర్టు నందు వారికి రావలసిన బాకి రాబట్టు కొనుటకు దావా వేసియున్నారు. సదరు దావాలో పైన I.A. No. 412/2023లో ఆర్డర్ ప్రకారము ప్రతివాదులు(defendants)కి పత్రికాముఖముగా మహారాజశ్రీ కోర్టు వారు నోటీసు Summons జారి చేసియున్నారు. పై ఆర్డర్ ప్రకారము ప్రతివాదులు స్వయముగా గాని న్యాయవాదిగారి ద్వారా గాని **తే 14-9-2023 ఉదయము గం 10-30**ని మహారాజశ్రీ కోర్టు నందు హాజరు అయ్యి వారి అభ్యంతరములను తెలుపుకోవచ్చును.

**Sri Pantula Janaki Rama Joga Rao**
Advocate for Plaintiff
Vizianagaram, Cell: 94407 54296

పబ్లికేషన్
**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గజపతినగరం**
**OS 114/2021**

Between:
పొట్నూరు రూప ......వాది
And:
చెరుకూరి నరసింహులు @ నరసింగరావు మరియు వగైరాలు ......ప్రతివాదులు
To
**D2.** చెరుకూరి మహేష్, S/o. Late వెంకటరావు, R/o గరుడబిల్లి గ్రామం, నెలివాడ పంచాయతీ, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.
**D3.** చెరుకూరి శ్రీను, S/o. Late వెంకటరావు, R/o గరుడబిల్లి గ్రామం, నెలివాడ పంచాయతీ, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరుగల కోర్టుయందు వాది దావా నమోదు చెయ్యగా శ్రీ కోర్టువారు వాదికి ఆర్డరు జారీ చేసిన ప్రకారము పలుమార్లు నోటీసులు పంపించిననూ మీరు తీవ్ర జాప్యం చెయ్యడం వలన తిరస్కరించుట వలన తే 22-9-2023న వాయిదా కలదని ఈ నోటీసు పత్రికా ముఖంగా మీకు తెలియజేయమని శ్రీ కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. కావున వాయిదా రోజున అనగా **తేది 22-9-2023 ఉదయం 10-30 ని॥**లకు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించుదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
**కె.రవిబాబు**
అడ్వకేట్, విజయనగరం
సెల్ : 9440343921

**మహారాజశ్రీ విజయనగరం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో**
**IA 883/2022 OS 68/2016**

Between:
రౌతు వెంకట జగన్నాధం నాయుడు ...పిటిషనర్/వాది
And:
వానపల్లి వెంకటరమణ...రెస్పాండెంట్/ప్రతివాది
To
వానపల్లి వెంకటరమణ, S/o. Late అప్పలస్వామి, హిందూ, వ॥ 50సం॥. వ్యవసాయము, సా॥ డోరు నెం. 11-32, ఇప్పలవలస గ్రామం, మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌ను పిటిషనర్/వాది U/s 5, 5 limitation act ప్రకారం 88 రోజులు ఆలస్యముగా U/o 9, Rule 9 పిటిషన్ దాఖలు చేసినందుకు delay condone చేయమని పై పిటిషన్ దాఖలు చేసినందున పై పిటిషన్ వాయిదా అయిన తే 14-9-2023దీ అయి ఉన్నది. మీరు వాయిదా **తే 14-9-2023దీ**ని వాయిదాకు మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరుచు కోవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

**యం.సూర్యనారాయణ**
అడ్వకేట్, చీపురుపల్లి
సెల్ : 9492542611

**మహారాజశ్రీ విజయనగరం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో**
**IA 884/2022 OS 68/2016**

Between:
రౌతు వెంకట జగన్నాధం నాయుడు ...పిటిషనర్/వాది
And:
వానపల్లి వెంకటరమణ ...రెస్పాండెంట్/ప్రతివాది
To
వానపల్లి వెంకటరమణ, S/o. Late అప్పలస్వామి, హిందూ, వ॥ 50సం॥. వ్యవసాయము, సా॥ డోరు నెం. 11-32, ఇప్పలవలస గ్రామం, మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌ను పిటిషనర్/వాది U/o 9, Rule 9 పిటిషన్ దాఖలు చేసియున్నారు. పై పిటిషన్ వాయిదా అయిన తే 14-9-2023దీ అయి ఉన్నది. మీరు వాయిదా **తే 14-9-2023దీ**ని మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరుచు కోవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

**యం.సూర్యనారాయణ**
అడ్వకేట్, చీపురుపల్లి
సెల్ : 9492542611